"నీ కెన్ని సార్లు చెప్పాలి సీతా, నాతోబాటే నువ్వూ లేవద్దని? పది గంటలకి కదా ఆఫీసు?"

"అదేమిటొదినా! మవ్వొక్కర్తివే ఇంత పనితో సతమతమై పోతే నేనెలాగా ఎలా నిద్రపోను?"

"ఎంత పని చేసినా మీ అన్నయ్య, పిల్లలు బయటికి వెళ్ళేంత వరకే కదా? తరవాత అంతా రెస్టే. ఉద్యోగం ఒకటి చేస్తున్నావు, ఏం సరదాయో గాని. . . ఇంట్లో పనికూడా నెత్తిన వేసుకుంటే ఆరోగ్యం పాడవదూ? అసలే గాలికి ఎగిరి పోయేట్టున్నావు!"

"సరి— నా ఉద్యోగం మాటే చెప్పాలి. నువ్విలా నన్ను ముద్దు చేస్తే ద్వారాలు పెద్దవి చేయించమని ఇంటి వాళ్ళని అడగాలి!"

"ఓహో అదా నీ భయం! రాబోయే మా తమ్ముడు మెచ్చడనా! సరే, నీ కంతగా పని కావాలంటే వెళ్ళి, ఆ మూండు గదిలో కుంభకర్ణుడి వారసులు నిద్రలో తున్నారు—వాళ్ళను లేపి పుస్తకాలు పట్టించు."

"అబ్బ! ఏ కష్టి వేలాకోళాలే, వదినా!"

• • •

"గుడ్‌మార్నింగ్, అత్తయ్యా! చూశావా ఎవరూ లేపకుండానే లేచి చదువు మొదలు పెట్టేశాను!"

"హఠాత్తుగా మంచివాడి వయి పోయావు! ఆశ్చర్యంగా ఉందే! మరి బుజ్జమ్మని లేపావు కాదేం?"

"తరవాత లేపవచ్చు గాని అత్తా, నా కో చిన్న సాయం చేసి పెట్టవూ?"

"ఏమిటే, నాన్నా?"

"చెప్పుతాను—ముందు చేస్తానన్నా! ప్లీజ్!"

"ఏమిటో చెప్పు మరి."

"హోమ్‌వర్కు చెయ్యడం మరిచి పోయాను. ఈ వేళ చూపించాలి!"

"ఓహో, అదా అసలు కథ! స్కూలు కింకా మూడు గంటలు టైముందిగా? నిక్షేపంగా చెయ్యి."

"ప్లీజ్! చాలా ఉందత్తా. అదేమిటో గాని నిన్న సాయంత్రం నుంచి నా కుడి చెయ్యి ఒకటే నొప్పి! నువ్వు కాదంటే ఈవేళ క్లాసులో దెబ్బలు తప్పవు! నువ్వు ఆఫీసునుంచి వచ్చి నువ్వే జాలి పడి పోతావు నా మీద అయ్యో, ఎంత గట్టిగా కొట్టేశాడు టీచర్! అని. మా మంచి అత్తయ్యవు కదూ— ప్లీజ్!"

"హుఁ తప్పుతుందా? బాగా కబుర్లు నేర్చుకున్నావు బాగా. ఆ పోళ్ళు ఇలా పడేసి వెళ్ళిప తీసుకురా."

• • •

"హోల్డాన్! హోల్డాన్! త్వరగా రండి! ఇంకో క్షణం ఆగుంటే నన్ను కూడా వదిలేసి లాగించేస్తాడు మా డ్రైవర్. ఆఁ... రైట్, రైట్. అయినా, మీ రీ వేళ బాగా లేటయి పోయేరేమిటి? ముందు ట్రిప్‌లో వచ్చేవారుగా రోజూ!"

"ఇప్పుడుకూడా బస్సు మిస్ అయి పోయాననే అనుకున్నాను. మీ రావటట్టి సరిపోయింది. దారిలో మా పాత ఫ్రెండ్ ఒకామె కనిపించి కబుర్లతో ఎంతకీ వద లేదు."

"మొత్తంమీద అందుకున్నారు కదా అఫీస్ టైమ్‌కి! లేడీస్ సీట్లు ఖాళీ అయ్యేట్టు లేవు ఇప్పుడప్పుడే. దిగేటప్పుడు కట్ చేస్తాము లెండి టికెట్."

"మేడమ్! ఇలా వచ్చి కూర్చోండి. మా కాలేజి వచ్చేసింది. దిగిపోతున్నాం."

"థాంక్యూ!"

• • •

"ఏదో విశేషంలా ఉందే? సెక్షనంతా సీత చుట్టూ చేరిపోయారు! మ్యాజిక్‌షో ఏమైనా ఇస్తున్నావేమి టమ్మాయీ?"

"మాజిక్ అంటారేమిటండీ! పెద్ద ఏక్సిడెంట్ చేసుకొని వస్తే ఈవిడ!"

"అరెరె. . . అయామ్ వెరి సారీ! ఎక్కడ? ఎప్పుడు? ఏక్సిడెంట్ ఎలా అయింది?"

"అబ్బే, ఏం లేదండీ! ఆఫీసు తొందరలో రోడ్డు మీద కాలికి రాయి తగిలి చిన్న దెబ్బ తగిలింది. సారథిగారు తెగ ఆర్భాటం చేసేస్తున్నారు!"

"చిన్న దెబ్బా? స్లిప్పర్సు నిండా, ఆఫీస్ మెట్లనిండా, వరండా నిండా ఎర్రగా అయిపోతే? పెర్రిమేసన్ల వసుంధరకే మొహం తిరిగినంత పనయింది, ఆ రక్తం చూడగానే! లక్కీగా రామారావు డ్రాయర్లో ఫస్ట్ ఎయిడ్ సరంజామా ఉండబట్టి సేవ్ అయాం. శాంతగారు కట్టు కట్టేసిన తరవాత గాని బ్లీడింగ్ ఆగలేదు."

"రాజీటీ? ఏది? ఆఁ పెద్ద కట్టే కట్టాల్సి వచ్చిందే? అయినా సీతా, కాస్త చూసుకొని నడిచి రాలేకపోయావా? పది నిమిషాలు లేటయితే కొంపేం మునిగి పోయింది! ఎందుకైనా మంచిది ఈవినింగ్ ఓ గంట పెర్మిషన్ తీసుకొని డాక్టరు దగ్గరికి వెళ్ళి పెనిసిలిన్ వేయించుకో. ఆఫీసర్‌గారితో చెప్పుతాను. దెబ్బ నొప్పి చేస్తుంది. సీట్లోంచి లేచి అటూ ఇటూ తిరక్కు. వసుంధర నీ కేమైనా హెల్ప్ కావాలంటే చేస్తుందిలే."

• • •

"సీతా! లంచ్ టైమ్ అయింది. ఇక లే. మధ్యాహ్నం ఇద్దరం కలిసి చూద్దాంలే ఆ పర్కు. నేను ఫ్రీయేకదా?"

"జస్ట్ ఎ మినిట్!"

"ఎనౌన్స్‌మెంట్! హియర్ ఈజ్ ఎన్ ఎనౌన్స్‌మెంట్, ఒక ముఖ్య ప్రకటన!"

"ఏమండోయ్, రంగారావు గారూ! ఆ మూల నుంచి చెపితే మా కేం వినిస్తుంది? మధ్యకు వచ్చి చెప్పండి!"

"ఈ వేళ ఎవరూ కాంటీన్‌కి వెళ్ళనక్కర్లేదు! డైనింగ్ టేబిల్ దగ్గరికి స్వీట్లు, హాట్లు వస్తున్నాయి."

"ఏమిటి విశేషం? పార్టీయా?"

"అలాంటిదే."

"ఎవరిది పార్టీ? ఏమా కథ? ఇంతకు ముందు ఎప్పుడైనా ఇలానే పార్టీ ఇచ్చారా?"

"వసుంధరగారూ! మీరు పెర్రిమేసన్లు చదవటం కాదు గాని, అప్పుడే మొదలు పెట్టారు ప్రశ్నలు! పార్టీం ఆఫీస్ని నేను కష్టపడి ఓ పార్టీ సంపాదించి ఎనౌన్స్ చేస్తే. . . థాంక్స్ అన్నా చెప్పకుండా..."

"సారీ, థాంక్స్! మెనీ మెనీ థాంక్స్! సస్పెన్సులో పెట్టి చంపక ఇక చెప్పండి పార్టీ ఎవరిదీ అని."

"రామారావూ! నువ్వే చెప్పుకో అమ్మా ఆ శుభవార్త."


"నువ్వుండవోయ్, రంగా. మరీ అంత ఇబ్బంది పెట్టేస్తున్నావు. కుర్రాడు సిగ్గు పడి పోతుంటే! నేను చెప్పుతాను, వినమ్మా! రామారావుకీ కష్టాలు ప్రారంభం అవబోతున్నాయి."

"అంటే ఏమిటండీ?"

"పెళ్ళవబోతూంది. ఇంకేం మాట్లాడకండి ఎవరూ. అదుగో పాకెట్లు వచ్చేస్తున్నాయి. అందరూ కూర్చున్నారా? అసలు కార్యక్రమం ప్రారంభిద్దాం."

"అయితే, రామారావూ, ఇది ఎడ్వాన్స్ మాత్రమే. మీ శ్రీమతితో కలిసి మరో సారి గ్రాండ్ డిన్నర్ ఇవ్వాలి—తెలుసా?"

"తప్పకుండా. కాని, మారేజ్‌కి అందరూ అటెండ్ అవాలన్న కండిషన్ మీదే!"



"ఇంతకీ కొంపదీసి నెక్స్టుమంత్ పిక్నిక్ పోస్ట్‌పోన్ చేసుకోవాలేమిటి మారేజ్ కోసమని?"

"పిక్నిక్కేముందండీ, రాజేశ్వరిగారూ! మొన్నే కదా ప్రాజెక్ట్ ఏరియాకి వెళ్ళొచ్చాం. మీరు తెచ్చిన మైసూర్‌పాక్‌ల తడాఖాకి పట్టుకున్న దవడ పీకులు ఇంకా తగ్గనే లేదు ఎవరికీ!"

"అబ్బ, ఛాన్స్ దొరికితే ఏకేస్తున్నా రండీ. ఏదో పాళ్ళు సరిగ్గా కుదరక కొంచెం గట్టిగా వచ్చాయని! ఈ సారి మీరు చేసి పట్టండి చూద్దాం మహా!"

"ఏముందోయ్, మాకు చేత కాదనా? నలుడూ, భీముడూ మా వాళ్ళేనండీ. మైసూర్‌పాక్‌లేం ఖర్మ అంతకన్న బ్రహ్మాండమైనవే చేస్తాం మీ కంత సరదా ఉంటే పందెం వేయండి!"

"గుడ్, గుడ్! అదీ స్పిరిట్ అంటే. మగవాళ్ళ పరువునిలబెట్టావోయ్, సారథీ! ఏదీ, అందరూ ఓ సారి చెప్పండి సారథి కీ జై! సారథి స్వీట్‌లకీ జై!"

• • •

"ఒన్నాయ్, సీతా, ఫైవ్ అయి పోయింది! ఫైళ్ళు కట్టు. సంతకాలు పెడతాను. ఇలా కుర్చీలో కూర్చో. నీతో మాట్లాడాలి."


"ఏమండీ?"

"ఏమిటీ కాగితం? బి. ఎ. పరీక్షలు వ్రాయడానికి లీవు కావాలా నీకు? ఇది బిజీ మంత్ అని తెలియదా?"

'.........'

"ఇద్దరప్పుడే సిక్ లీవ్ లో ఉన్నారు. రామారావుకి మారేజ్ లీవ్ కావాలి. . . కనీసం గోపాలం ట్రెయినింగ్ నుండి వచ్చేదాకన్నా నీ లీవ్ గ్రాంట్ చెయ్యడం కుదరదు!"

"ఎలా అయినా నాకు లీవ్ అవసరం అండీ! ఈ సారి ఎగ్జామ్స్ వ్రాయకపోతే



సంవత్సరం ప్రిపరేషన్ వేస్ట్యి పోతుం డండీ!"

"దానికి నే నేం చేస్తాను?"

"ప్లీజ్! నా కేస్ ఎలా అయినా కన్సిడర్ చెయ్యాలండీ."

"సరే, నువ్వంతగా రిక్వెస్ట్ చేస్తున్నావు గనక ఓ సజెషన్ ఇస్తాను. నువ్వో మారేజ్ చేసుకో. మారేజ్ కోసం లీవ్ గ్రాంట్ చేసి తీరాలన్నది నా పాలసీల్లో ఒకటి. నీకు గనక చెప్తున్నానో రహస్యం. ఎవరికైనా మారేజ్ లీవ్ ఇవ్వలేదని తెలిస్తే మా ఆవిడ నాకు భోజనం పెట్టదు! అరెరే! ఏమి టలా నవ్వుతున్నావు?"

"మీరు చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారండీ!"

"కాదు. సీరియస్‌గా మాట్లాడుతున్నాను. జాగ్రత్తగా విను. పెళ్ళికొడుకును కూడా నేనే సజెస్ట్ చేస్తున్నాను. క్రిందటి సారి మనం ప్రాజెక్ట్ ఏరియాకి పిక్నిక్ వెళ్ళినప్పుడు మనకి అన్ని ఏర్పాట్లు చేశాడు మా అబ్బాయి. అసిస్టెంట్ ఇంజనీర్. చూశావు కదా? వాడు. . . వాడికి నీ మీద మనసయింది. వాళ్ళ అమ్మకూడా నిన్ను ఆ రెండు రోజులూ బాగా అబ్జర్వ్ చేసి సర్టిఫై చేసింది, మా ఇంటికోడలు కాదగ్గ లక్షణాలన్నీ నీలో ఉన్నాయని. నీ కభ్యంతరం లేకపోతే మా పెద్దవాళ్ళతో మిగతా విషయాలు మాట్లాడతాను. ఏమంటావు? అరెరే, అప్పుడే మొహం ఎర్రబడి పోతుం దేమిటి?"

• • •

"ఒరేయ్, బాబిగా, ఆ మహారాణిని లేపరా. ఇంకా తెల్లవారనట్లుంది! అవతల పనిమనిషి రావడం లేదని తెలుసుగా? ఈ అంట్లన్నీ ఎవడు తోముతాడు? ఇంతోటి ఉద్యోగం వెలగబెడుతూందని బారెడు పొద్దెక్కిందాకా లేవదు."

పెరట్లోంచి కంచుగంటలా వినిపిస్తున్న పిన్ని గొంతుక్కి ఉలికిపాటుతో తెలివి వచ్చింది సీతకి. ఎదురుగా టేబిల్ మీద వాచీ ఆరున్నర చూపిస్తున్నది. మళ్ళీ మొదలయింది రోజు.

పిన్ని సాధింపులు..,


ఒళ్ళు హూనమయేలా ఇంటి చాకిరి..,

బస్‌స్టాప్‌లో రోమియోలు...

నడుస్తున్న నరకం లాంటి సిటీబస్.

ఆఫీసు తోడేళ్ళ వెకిలి చూపులు, రెండర్థాల మాటలు...

హిరణ్యకశిపుడి తమ్ముడి లాంటి సూపరింటెండెంట్ అరుపులు... అన్నీ ఒక్కసారి గుర్తుకు వచ్చి భారంగా నిట్టూరుస్తూ పక్కమీద నుంచి లేచింది సీత. ★



ఏది పువ్వు?

ఫొటో—బి. ఎమ్. చోప్రా (చండీఘర్)